క్లుప్తంగా

నేడు కంటి వైద్యశిబిరం

భానుపురి (సూర్యాపేట) : పట్టణంలోని ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం కార్యాలయంలో సోమవారం వరంగల్‌కు చెందిన శరత్ మ్యాక్సీ విజన్ లేజర్ కంటి ఆసుపత్రి ఆధ్వర్యంలో ఉచిత కంటి శిబిరాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు సంఘం మండల అధ్యక్ష, కార్యదర్శులు దండ శ్యాంసుందర్‌రెడ్డి, సుధగాని నాగేశ్వరరావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10గంటల నుంచి ఒంటిగంట వరకు నిర్వహించే వైద్యశిబిరంలో పెన్షనర్లు, ఆరోగ్యశ్రీ కార్డుదారులు, జర్నలిస్టులు పాల్గొనాలని తెలిపారు.

మండలాల్లో ఎమ్మెల్యే పర్యటన

తిరుమలగిరి : మండలంలోని తాటిపాముల గ్రామంలో ఉపాధి హామీ నిధులు రూ.60లక్షలతో నిర్మించినున్న సీసీరోడ్లు, డ్రెయినేజీ పనులకు సోమవారం ఎమ్మెల్యే మందుల సామేల్ శంకుస్థాపన చేయడానికి గ్రామానికి వస్తున్నట్లు ఆ పార్టీ నాయకులు ఆదివారం వెల్లడించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొనాలని కోరారు.

నాగారం : మండలంలో సోమవారం ఎమ్మెల్యే మందుల సామేలు పర్యటించనున్నట్లు కాంగ్రెస్ మండల అధ్యక్షుడు తొడుసు లింగయ్యయాదవ్ తెలిపారు. ఆదివారం మండల కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. మండలంలోని ఫణిగిరి గ్రామంలో డాక్టర్ బీఆర్ అంబేద్కర్, మహాత్మాజ్యోతిరావు పూలే విగ్రహాల ఆవిష్కరణ కార్యక్రమంలో పాల్గొంటారని, అలాగే పసునూర్ గ్రామంలో వాటర్‌ప్లాంట్‌ను ప్రారంభించనున్నట్లు తెలిపారు.

ఎస్ఐ శ్రీకాంత్‌గౌడ్ బాధ్యతల స్వీకరణ



బాధ్యతలు స్వీకరిస్తున్న శ్రీకాంత్‌గౌడ్

ఆత్మకూర్ (ఎస్) : మండల నూతన ఎస్ఐగా బత్తిన శ్రీకాంత్‌గౌడ్ ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు ఎస్ఐగా విధుల నిర్వర్తించిన వై.సైదులుగౌడ్ వీఆర్‌కు బదిలీకావడంతో సీసీఎస్‌లో పనిచేసిన శ్రీకాంత్‌గౌడ్ మండలానికి బదిలీపై వచ్చారు. ఈ సందర్భంగా ఎస్ఐ శ్రీకాంత్‌గౌడ్ మాట్లాడారు. మండలంలో శాంతి భద్రతల రక్షణకు కృషిచేస్తానని అన్నారు. అనంతరం నూతనంగా బాధ్యతలు చేపట్టిన ఎస్ఐ శ్రీకాంత్‌గౌడ్‌ను మండల జేఏసీ నాయకులు కలిసి శాలువాతో సన్మానించారు.

ఆలయంలో కార్తీక పూజలు



అర్వపల్లి ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు

అర్వపల్లి : కార్తీక మాసాన్ని పురస్కరించుకొని అర్వపల్లిలోని శ్రీయోగానంద లక్ష్మీనర్సింహ స్వామి దేవాలయంలో ఆదివారం రెండో రోజు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా 27నక్షత్రాలతో అర్చకులు నక్షత్ర నీరాజన కార్యక్రమాన్ని చేపట్టారు. కార్యక్రమంలో అర్చకులు అర్వపల్లి రాంబాబుఅయ్యంగార్, పవన్ కుమార్, భక్తులు పాల్గొన్నారు.

సీపీఎం మండల కార్యదర్శిగా సైదులు



మద్దిరాల : మండల కేంద్రంలో సీపీఎం మండల మహాసభను ఆదివారం నిర్వహించారు. ఈ సభలో పార్టీ జిల్లా కార్యదర్శి మల్లు నాగార్జునరెడ్డి పాల్గొని మాట్లాడారు. అనంతరం మండలంలోని గోరెంట్ల గ్రామానికి చెందిన పూలోజు సైదులును పార్టీ మండల కార్యదర్శిగా ఎన్నుకున్నారు. ఆయనతో పాటు మరో 13మందిని కమిటీ సభ్యులుగా నియమించారు. ఈ సందర్భంగా సైదులు మాట్లాడారు. మండలంలో పార్టీ బలోపేతానికి శక్తి వంచన లేకుండా పనిచేస్తానని అన్నారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు కొలిశెట్టి యాదగిరిరావు, కోట గోపి, చెరుకు యాకలక్ష్మి, దండె వెంకట్‌రెడ్డి, సత్యం, కందాల శంకర్‌రెడ్డి, బుర్ర శ్రీనివాస్, యాదగిరి, కల్లెపల్లి భాస్కర్, పాల్వాయి కవిత, దీకొండ ఉపేందర్, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

నూతన కమిటీ ఎన్నిక

సూర్యాపేటటౌన్ : పట్టణంలోని గాంధీపార్కులో మాస్టిన్ కుల హక్కుల పోరాట సమితి సంఘం సమావేశాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సమావేశంలో సంఘం రాష్ట్ర నాయకులు నాగేల్లి కిష్టయ్య, రాష్ట్ర కన్వీనర్ నాగేల్లి నర్సయ్య ఆధ్వర్యంలో సంఘం జిల్లా నూతన కమిటీని ఎన్నుకున్నారు. జిల్లా నూతన అధ్యక్షుడిగా దర్శనం రాములు, ఉపాధ్యక్షుడిగా నాగేల్లి ప్రసాద్, ప్రధాన కార్యదర్శిగా నాగేల్లి నాగరాజు, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా నాగేల్లి సైదులు, కార్యదర్శిగా నాగేల్లి గోపి, కోశాధికారిగా నాగేల్లి రాములు, సహాయ కార్యదర్శిగా పొన్నాల అంజి, ప్రచార కార్యదర్శిగా నాగేల్లి మురళి, కన్వీనర్‌గా బత్తిని సతీష్, గౌరవ అధ్యక్షులుగా దర్శనం లింగయ్య, దర్శనం వెంకన్న, గౌరవ సలహాదారులు నాగేల్లి యాదయ్య, నాగేల్లి వెంకన్న, నాగేల్లి రామారావుతో పాటు కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. అనంతరం నూతన అధ్యక్షుడు దర్శనం రాములు మాట్లాడారు. మాస్టిన్ కుల హక్కుల పోరాట సమితి అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని ఆయన అన్నారు.

కొనుగోలు కేంద్రాలకు స్థలాల కొరత

- వ్యవసాయ భూములు, బోళ్లు, బండలపై కేంద్రాల ఏర్పాటు
- వర్షాలు వస్తే కేంద్రాల్లో కొట్టుకుపోతున్న ధాన్యం
- ఇబ్బందులు పడుతున్న రైతన్నలు
- శాశ్వత కేంద్రాలు ఏర్పాటు చేయాలని వేడుకోలు



కొత్తగూడెంలో బండలపై ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రం



కర్విరాలలో రోడ్డుపై ధాన్యాన్ని ఆరబోసిన రైతులు

తుంగతుర్తి : గ్రామాలలో ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాటుకు స్థలాల కొరత తీవ్రంగా ఉంది. దీంతో రైతులు, అధికారులు ఇబ్బందులు పడుతున్నారు. తుంగతుర్తి మండలంలో ప్రతి సీజన్‌కు ఐకేపీ, పీఏసీఎస్‌ల ఆధ్వర్యంలో 22ధాన్యపు కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నారు. వాటిలో మూడు పీఏసీఎస్ కేంద్రాలు కాగా, 19ఐకేపీ కేంద్రాలు ఉన్నాయి. అయితే ఈ కేంద్రాలకు తుంగతుర్తి, గానుగుబండ గ్రామాలలో మాత్రమే ప్రభుత్వ స్థలాలు ఉన్నాయి. మిగిలిన 20ధాన్యపు కొనుగోలు కేంద్రాలకు వ్యవసాయ భూముల్లో, బండల మీద, ప్రైవేట్ వ్యక్తుల భూముల్లో కొనుగోలు కేంద్రాలను నిర్వహిస్తున్నారు. కేంద్రాల ఏర్పాటుకు ప్రైవేట్ వ్యక్తుల భూములకు ఆ సీజన్‌కు గాను ఒక ఎకరానికి రూ.6వేల అద్దె చెల్లించాల్సి వస్తుంది. అన్నారం ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రానికి నాలుగు ఎకరాల భూమిని అద్దెకు తీసుకుంటున్నారు. ప్రతిసారి ఎకరానికి రూ.6వేల చొప్పున నాలుగు ఎకరాలకు రూ.24వేల అద్దె చెల్లించాల్సి వస్తుంది. మండలంలోని ప్రతి ధాన్యం కొనుగోలు కేంద్రానికి ఎంతో కొంత చెల్లించి రైతుల వద్ద నుంచి తీసుకుంటున్నారు. ప్రతిసారి రైతుల వ్యవసాయ భూములు, బోళ్లపై కేంద్రాలు ఏర్పాటు చేయాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది. కర్విరాలలో ధాన్యం ఆరబోసుకోవడానికి స్థలం లేక రోడ్డుపైనే పోకుంటున్నారు. బోళ్లు, బండలపై ఏర్పాటు చేసే కేంద్రాల్లో చిన్నపాటి వర్షం పడినా ధాన్యం రాశులు వరదకు కొట్టుకుపోయి రైతులకు తీవ్రనష్టం వాటిల్లుతుంది. ఈ కేంద్రాల వద్ద ధాన్యం లోడ్ చేసుకోవడానికి వాహనాలు వెళ్లాలంటే ఇబ్బంది అవుతోంది. కొత్తగూడెం, వెంపటి ఐకేపీ కొనుగోలు కేంద్రాలు బోళ్లు, బండలపై ఏర్పాటు చేయడంతో వారం రోజుల కిందట కురిసిన అకాల వర్షంతో ధాన్యం కొట్టుకుపోయి రైతులు నష్టపోయారు. వ్యవసాయ భూముల్లో ఏర్పాటు చేస్తున్న కొనుగోలు కేంద్రాల వద్దకు లారీలు, ట్రాక్టర్లు వెళ్లలేని పరిస్థితి నెలకొంది.

శాశ్వత స్థలాలు లేక ఇబ్బందులు..

ధాన్యం కొనుగోలు కేంద్రాలకు శాశ్వత స్థలాలు లేక అకాల వర్షాలతో రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. బోళ్లు, బండలు, చెలకల మధ్యే తాత్కాలిక కేంద్రాలు ఏర్పాటు చేయడంతో వర్షాలకు నష్టం కలుగుతుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండలంలో 24గ్రామపంచాయతీల్లో సుమారుగా 20వేల ఎకరాలకు పైగా ప్రతి సీజన్‌లో వరిసాగు చేస్తున్నారు. సుమారుగా 5.60లక్షల క్వింటాల ధాన్యం దిగుబడి వస్తుంది. ఈ ధాన్యం మొత్తం కొనుగోలు కేంద్రాల ద్వారానే అమ్మకాలు జరుగుతున్నాయి. ఇప్పటికైనా అధికారులు ప్రజాప్రతినిధులు స్పందించి ధాన్యం కొనుగోలు కేంద్రాలకు శాశ్వత స్థలాలు ఏర్పాటు చేయాలని ఆయా గ్రామాల రైతులు కోరుతున్నారు.

స్థలాలకు అద్దె చెల్లించి తీసుకుంటున్నాం



ధాన్యం కొనుగోలు కేంద్రాలకు స్థలాలను అద్దెకు తీసుకొని నడిపిస్తున్నాం. అన్నారం ఐకేపీ కేంద్రానికి నాలుగు ఎకరాల భూమిని అద్దెకు తీసుకుంటున్నాం. ప్రతి సీజన్‌కు రూ.24వేలు చెల్లిస్తున్నాం. అయినా రైతులు ఒక్కొక్కసారి స్థలం ఇవ్వడానికి ఆసక్తి చూపడం లేదు.

– చిత్తలూరి రమేష్, వీబీకే అన్నారం

శాశ్వత కేంద్రాలను ఏర్పాటు చేయాలి



ఐకేపీ ధాన్యపు కొనుగోలు కేంద్రాలకు స్థలాలు లేక సమస్యలు ఎదురవుతున్నాయి. మండలంలో ప్రతి సీజనకు 20వేల ఎకరాలకు పైగానే రైతులు వరిపంటను సాగు చేస్తున్నారు. ఈ పంటల ద్వారా సుమారు 5.60లక్షల క్వింటాళ్ల ధాన్యం దిగుబడి అవుతోంది. ఈ ధాన్యం మొత్తం కొనుగోలు కేంద్రాల ద్వారానే అమ్మకాలు జరుగుతున్నాయి. అధికారులు శాశ్వత స్థలాలు ఏర్పాటు చేసి తగు వసతులు కల్పించాలి.

– బుర్ర శ్రీనివాస్, సీపీఎం మండల కార్యదర్శి

తాత్కాలికంగా రైతుల భూముల్లో ఏర్పాటు చేస్తున్నాం



మండలంలో 22ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశాం. వాటిలో రెండు కేంద్రాలను మాత్రమే గ్రామాలలో ఉన్న ప్రభుత్వ భూమిలో నిర్వహిస్తున్నాం. ధాన్యం కొనుగోలు కేంద్రాలను తాత్కాలికంగా రైతుల వ్యవసాయ భూములలో ఏర్పాటు చేస్తున్నాం. ప్రభుత్వ స్థలాలు లేకపోవడంతో కొంత ఇబ్బంది ఏర్పడుతుంది. శాశ్వత కేంద్రాల ఏర్పాటు విషయం ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాల్సి ఉంటుంది.

– రాంబాబు, ఏపీఎం, తుంగతుర్తి

విద్యారంగ సమస్యలపై పీఆర్‌టీయూ నిరంతర పోరాటం



హెచ్‌ఎం రవీందర్‌రెడ్డి–రవీల దంపతులను సన్మానిస్తున్న నాయకులు

అర్వపల్లి : విద్యారంగ సమస్యల పరిష్కారానికి పీఆర్‌టీయూ టీఎస్ నిరంతరం పోరాడుతుందని ఆ సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు తంగెళ్ల జితేందర్‌రెడ్డి, తీగల నరేష్ అన్నారు. మండల పరిధిలోని తిమ్మాపురం ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం, పీఆర్‌టీయూ సీనియర్ నాయకుడు వడ్డె రవీందర్‌రెడ్డి ఉద్యోగ విరమణ సన్మాన కార్యక్రమాన్ని ఆదివారం సూర్యాపేటలో నిర్వహించారు. ఈ సందర్భంగా వారు పాల్గొని మాట్లాడారు. ఇటీవల జరిగిన ఉపాధ్యాయుల పదోన్నతులు, బదిలీలకు పీఆర్‌టీయూ ఎంతో కృషి చేసిందన్నారు. అనంతరం రవీందర్‌రెడ్డి–రవీల దంపతులను ఘనంగా సన్మానించారు. మండల అధ్యక్షుడు ఉల్లెందుల సైదులు అధ్యక్షతన జరిగిన సమావేశంలో గుంటకండ్ల దామోదర్‌రెడ్డి, మండల ప్రధాన కార్యదర్శి జలగం పురుషోత్తం, జిల్లా మాజీ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జ్యోతుల చంద్రశేఖర్, చింతరెడ్డి రామలింగారెడ్డి, ఎంఈఓ బి.బాలునాయక్, మండల నోడల్ అధికారి కుంభం ప్రభాకర్, తిమ్మాపురం పీఎస్ హెచ్‌ఎం జి.చంద్రారెడ్డి, చైర్‌పర్సన్ బొడ్డు స్వప్న, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు చిప్పలపెల్లి ధర్మయ్య, దండుగుల యల్లయ్య, గంజి శంకర్, కె.రమేష్, జిల్లా బాధ్యులు, వివిధ మండలాల నాయకులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బియ్యం వ్యాపారిపై కేసు

నూతనకల్ : అక్రమంగా పీడీఎస్ బియ్యం వ్యాపారం చేస్తున్న ఓ రైస్‌మిల్లు యజమానిపై ఆదివారం మండల పోలీసులు కేసు నమోదు చేసి అరెస్టు చేశారు. ఎస్ఐ మహేంద్రనాథ్ తెలిపిన వివరాల ప్రకారం.. గత నెల 16న పట్టుబడిన 30క్వింటాల పీడీఎస్ బియ్యం తరలింపులో ప్రధాన సూత్రధారి ఆత్మకూర్(ఎస్) మండలంలోని పాతర్లపహాడ్ గ్రామశివారులోని లక్ష్మి మోడ్రన్ రైస్‌మిల్లు యజమాని కాసం రమేష్‌తో పాటు మరో నలుగురిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. రమేష్‌పై బియ్యం అక్రమ రవాణాకు సంబంధించి ఇప్పటికే పలు కేసులు ఉండడంతో ప్రభుత్వం రూపొందించిన నూతన చట్టాల ప్రకారం వ్యవస్థీకృత ఆర్థికనేరాల కింద కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ వెల్లడించారు.

బంజారా మాతృభాషను సర్వేలో నమోదు చేసుకోవాలి

భానుపురి (సూర్యాపేట) : రాష్ట్రంలో ఈనెల 6నుంచి నిర్వహిస్తున్న సమగ్ర కుటుంబ ఇంటింటి సర్వేలో సీరియల్ నంబర్ 10లో గోర్‌బోలి భాష మాట్లాడే బంజారా ప్రజలు మాతృభాష గోర్బోలిని (లంబాడీ భాష) గా నమోదు చేయించుకోవాలని లంబాడీ హక్కుల పోరాట సమితి జిల్లా కన్వీనర్ భూక్య రాజునాయక్ ఆదివారం ఒక ప్రకటనలో కోరారు. రాబోయే రోజుల్లో లంబాడీ మాతృభాష అయిన గోర్‌బోలిని భారత రాజ్యాంగంలోని 8వ షెడ్యూల్లో చేర్చాలని డిమాండ్ చేస్తూ దేశవ్యాప్తంగా ఉద్యమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కావున ప్రతిఒక్కరూ తమ బాధ్యతగా మాతృభాష సీరియల్ నంబర్ 10లో లంబాడీ భాష గోర్‌బోలిని నమోదు చేయించుకోవాలన్నారు.

బీసీల రాజ్యాధికారం కోసం ఉద్యమిస్తాం



ర్యాలీని ప్రారంభిస్తున్న వట్టె జానయ్యయాదవ్

సూర్యాపేట : రాష్ట్రంలో బీసీలు రాజ్యాధికారం సాధించే వరకు ఉద్యమిస్తామని డీసీఎంఎస్ మాజీ చైర్మన్ వట్టె జానయ్యయాదవ్ అన్నారు. మిర్యాలగూడ పట్టణంలో నిర్వహించిన బీసీగర్జన సభకు పట్టణం నుంచి వెయ్యిమందితో ఆయన భారీ ర్యాలీగా వెళ్లారు. అంతకు ముందు పట్టణంలో మహాత్మాజ్యోతిరావు పూలే విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో 60శాతం ఉన్న బీసీలు విద్యా, ఉద్యోగ, రాజకీయ రంగాలలో అన్యాయానికి గురవుతున్నారని అన్నారు. పదేళ్ల బీఆర్‌ఎస్ పాలనలో బీసీల రిజర్వేషన్‌లను 33శాతం నుంచి 23శాతానికి తగ్గించారని ఆవేదన వ్యక్తం చేశారు. ఏఐసీసీ నాయకుడు రాహుల్‌గాంధీ ఇచ్చిన హామీ కామారెడ్డి డిక్లరేషన్ ప్రకారం బీసీలకు జనాభా ప్రాతిపదికన 42శాతం రిజర్వేషన్‌లు కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కౌన్సిలర్ అన్నెపర్తి రాజేష్, కుంభం నాగరాజు, మల్లయ్య, ముక్కాల సుమన్, లింగస్వామి, వల్లాల సైదులు, ఆవుల అంజయ్య, కరుణాకర్, పగిళ్ల శరత్, శోభన్‌గౌడ్, శ్రీకాంత్, లింగాల సైదులు, దోసకాయల ఫణినాయుడు, బొమ్మగాని సైదులుగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు డైట్, కాస్మొటిక్ చార్జీలు పెంచడం హర్షణీయం

నాగారం : రాష్ట్ర ప్రభుత్వం వసతిగృహాల్లోని విద్యార్థులకు డైట్, కాస్మొటిక్ చార్జీలను పెంచడం హర్షణీయమని యూత్ కాంగ్రెస్ మండల ప్రధాన కార్యదర్శి షేక్.వలీ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. చరిత్రలో ఎన్నడూ లేని విధంగా 40శాతం డైట్, కాస్మొటిక్ చార్జీలను పెంచిన ఘనత సీఎం రేవంత్‌రెడ్డికే దక్కిందన్నారు. డైట్, కాస్మొటిక్ చార్జీలు పెంచడంతో రాష్ట్ర వ్యాప్తంగా 7.65లక్షల మంది విద్యార్థులకు లబ్ధి జరగనుందన్నారు. ఆయన వెంట యూత్ కాంగ్రెస్ నాయకులు అక్బర్‌పాషా, సైదులు, అక్బర్, హుస్సేన్ తదితరులు ఉన్నారు.

ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి



సేవాదళ్ నాయకులకు నియామక పత్రాలు అందజేస్తున్న డీసీసీ ఉపాధ్యక్షుడు యోగానందాచారి

అర్వపల్లి : కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను నాయకులు, కార్యకర్తలు ప్రజల్లోకి తీసుకెళ్లాలని డీసీసీ ఉపాధ్యక్షుడు దరూరి యోగానందాచారి అన్నారు. ఆదివారం అర్వపల్లిలో కాంగ్రెస్ అనుబంధ సేవాదళ్ నూతన మండల కమిటీని ఎన్నుకున్నారు. ఈ సమావేశంలో ఆయన పాల్గొని బాధ్యులకు సేవాదళ్ మండల అధ్యక్షుడు బొర్ర గిరిబాబుతో కలిసి నియామక పత్రాలను అందజేశారు. మండల సేవాదళ్ ఉపాధ్యక్షుడిగా జ్యోతుల వెంకన్న, ఆరె.విజయ్, కార్యనిర్వాహక అధ్యక్షులుగా బొల్ల నవీన్‌కుమార్, మామిడి సురేష్, ప్రధాన కార్యదర్శులుగా బందెల నరేష్, కేసగాని కార్తీక్, మల్యాల గుట్టయ్య, కార్యదర్శులుగా రవి, శ్రవణ్, అడివెంల గ్రామ సేవాదళ్ అధ్యక్ష, ఉపాధ్యక్షులుగా జంపాల రమేష్, పేరెల్లి సతీష్ నియామక పత్రాలను అందుకున్నారు. కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్ష, ఉపాధ్యక్షులు అనిరెడ్డి రాజేందర్‌రెడ్డి, నర్సింగ శ్రీనివాస్‌గౌడ్, మండల అధ్యక్షుడు మోరపాక సత్యం, సతీష్‌రెడ్డి, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు శిగ నసీర్‌గౌడ్, మేకల రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో ముత్యాలమ్మ విగ్రహ ప్రతిష్ఠాపన



పూజల్లో పాల్గొన్న భుజంగరావు, గ్రామస్తులు

పెన్‌పహాడ్ : మండల కేంద్రంలో నూతనంగా నిర్మించిన శ్రీముత్యాలమ్మ తల్లి ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠను వేదపండితులు మంత్రోచ్ఛరణలతో శనివారం రాత్రి వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం గ్రామంలో అమ్మవారిని ఊరేగింపు నిర్వహించారు. ఈ వేడుకలో టీపీసీసీ కార్యదర్శి తూముల భుజంగరావు, తూడి వెంకటరంగారెడ్డి, ఒగ్గు సైదులు, ఆరె ప్రభాకర్, ఒగ్గు రవి, పరమేష్, ఎల్లయ్య, చినసైదులు తదితరులు పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత

ఆత్మకూర్(ఎస్) : మండలంలోని పాతర్లపహాడ్ గ్రామానికి చెందిన రేషన్‌డీలర్ ఆరింపుల రాములు చిన్న కుమార్తె భవానికి అనారోగ్యం బారిన పడడంతో స్పందించిన మండల రేషన్‌డీలర్లు ఆదివారం రాములుకు రూ.21వేల ఆర్థికసాయం అందజేశారు. అదేవిధంగా మండల కేంద్రానికి చెందిన రావుల వీరయ్య ఇటీవల అనారోగ్యంతో మృతి చెందడంతో యంగ్‌స్టార్ యూత్ క్లబ్ సభ్యులు బాధిత కుటుంబానికి రూ.31వేల ఆర్థికసాయం అందజేశారు.

అర్వపల్లి : మండల పరిధిలోని కాసర్లపహాడ్ గ్రామానికి చెందిన చెరుకు భిక్షమమ్మ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందింది. ఆదివారం బాధిత కుటుంబాన్ని డీసీసీ ఉపాధ్యక్షుడు యోగానందచారి పరామర్శించి రూ.5వేల ఆర్థికసాయం అందజేశారు.

మహా సమ్మేళనానికి తరలిన డీఎస్పీ నాయకులు

నాగారం : హైదరాబాద్‌లోని ఆదిభట్లలో ఆదివారం నిర్వహించిన ధర్మ సమాజ్ పార్టీ మహా సమ్మేళనానికి (మొదటి ప్లీనరీ)కి మండల నుంచి డీఎస్పీ నాయకులు తరలివెళ్లారు. ఈ సందర్భంగా పార్టీ మండల కన్వీనర్ చిప్పలపల్లి నాగార్జున మాట్లాడారు. 70ఏళ్లుగా బీఆర్‌ఎస్, బీజేపీ, కాంగ్రెస్ ప్రభుత్వాలు ఎస్సీ, ఎస్టీ, బీసీ ప్రజలను దోచుకొని వారికి కనీసం విద్య, వైద్యం, ఉపాధి, భూమి, ఇల్లు లేకుండా చేశాయన్నారు. అగ్రవర్ణ పార్టీలకు అభిముఖంగా ధర్మ సమాజ్ పార్టీ విశారదన్ ఆధ్వర్యంలో ఏర్పడిందన్నారు. సమ్మేళనానికి వెళ్లిన వారిలో నాగార్జున, పెద్దశ్రీనివాస్, వీరేష్ ఉన్నారు.

విద్యుత్ గ్రీవెన్స్ డేను సద్వినియోగం చేసుకోవాలి



భానుపురి (సూర్యాపేట) : దరఖాస్తులను స్వీకరిస్తున్న విద్యుత్ అధికారులు

భానుపురి (సూర్యాపేట) : విద్యుత్ వినియోగదారులు గ్రీవెన్స్ డేను సద్వినియోగం చేసుకోవాలని విద్యుత్ శాఖ ఎస్ఈ ఫ్రాంక్లిన్ అన్నారు. విద్యుత్ వినియోగదారుల దినోత్సవం సందర్భంగా పట్టణంలోని జమ్మిగడ్డ పిరమిడ్ కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన విద్యుత్ గ్రీవెన్స్‌లో ఆయన పాల్గొని వినియోగదారుల నుంచి విద్యుత్ సమస్యలపై దరఖాస్తులను స్వీకరించి మాట్లాడారు. ప్రతినెలా మొదటి సోమవారం ఉదయం 10గంటల నుంచి విద్యుత్ సమస్యల పరిష్కారం కోసం సూర్యాపేట జిల్లా సూపరింటెండెంట్ ఇంజనీరింగ్ ఆపరేషన్ సర్కిల్ కార్యాలయంలో గ్రీవెన్స్‌డే నిర్వహించనున్నట్లు తెలిపారు. విద్యుత్ వినియోగదారులకు ఎలాంటి సమస్యలు ఉన్నా గ్రీవెన్స్ డేలో దరఖాస్తు చేసుకోవాలని అన్నారు. కార్యక్రమంలో ఎస్ఏఓ ఎం.సత్యనారాయణ, డీఈ శ్రీనివాసులు, ఏడీఈ శ్రీనివాస్, ఏఏఓ లింగయ్య, మల్లేష్‌గౌడ్, నసీర్ తదితరులు పాల్గొన్నారు.



నాగారం : వినియోగదారుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్న ఏడీఈ రాములునాయక్

విద్యుత్ సమస్యలను పరిష్కరిస్తాం

నాగారం : గ్రామాల్లో నెలకొన్న విద్యుత్ సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తామని నాగారం సబ్‌డివిజన్ ఏడీఈ రాములునాయక్ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని విద్యుత్ సబ్‌స్టేషన్‌లో విద్యుత్ వినియోగదారుల దినోత్సవాన్ని పురస్కరించుకొని నాగారం, జాజిరెడ్డిగూడెం, తిరుమలగిరి మండలాల విద్యుత్ వినియోగదారులతో ఏర్పాటు చేసిన సమావేశంలో పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వం ఇప్పటికే నిరంతర విద్యుత్ సరఫరా చేస్తుందన్నారు. నాణ్యమైన నిరంతరాయ విద్యుత్ సరఫరాకు అధికారులకు వినియోగదారులు సహకరించాలని కోరారు. అనంతరం ఆయా గ్రామాల్లో నెలకొన్న విద్యుత్ సమస్యలపై వినియోగదారుల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. కార్యక్రమంలో విద్యుత్ ఏఈఈ మహేంద్రకుమార్, సబ్ ఇంజనీర్లు నజీర్, గిరిబాబు, సాయిబాబా, ఫోర్‌మెన్ కృష్ణారావు, విద్యుత్ సిబ్బంది, వినియోగదారులు, రైతులు పాల్గొన్నారు.

కలెక్టరేట్ ఎదుట ధర్నాను విజయవంతం చేయాలి



కరపత్రాలు విడుదల చేస్తున్న నాయకులు

తిరుమలగిరి : ట్రాన్స్‌పోర్ట్ కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేస్తామని కాంగ్రెస్ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీని వెంటనే అమలుచేయాలని డిమాండ్ చేస్తూ నవంబర్ 5న సూర్యాపేట కలెకరేట్ వద్ద నిర్వహించే ధర్నాలో కార్మికులు పాల్గొనాలని తెలంగాణ పబ్లిక్, ప్రైవేట్ రోడ్ ట్రాన్స్‌పోర్ట్ వర్కర్స్ ఫెడరేషన్ జిల్లా కార్యదర్శి ఎం.రాంబాబు పిలుపునిచ్చారు. ఆదివారం పట్టణంలో ధర్నాకు సంబంధించిన కరపత్రాలు ఆయన విడుదల చేసి మాట్లాడారు. లారీ, ఆటో ట్రాక్టర్, స్కూల్‌బస్సు, గూడ్స్ లారీ, కారుటాక్సీలపై సుదీర్ఘకాలంగా పనిచేస్తున్న వారి ప్రాణాలకు భద్రత లేదన్నారు. కేంద్ర ప్రభుత్వం ఇటీవల తీసుకొచ్చిన చట్టాలతో రోడ్డు ప్రమాదాల నియంత్రణ జరిగిందన్నారు. ఇతర దేశాల్లో మాదిరిగా మన దేశంలో కూడా రోడ్ల విస్తరణ, రోడ్ల విభజన జరగాలన్నారు. సంక్షేమ బోర్డు, ఆటో కార్మికులకు సంవత్సరానికి ఇస్తానన్న రూ.12వేలు, తదితర డిమాండ్ల పరిష్కారానికి ఐక్య పోరాటాలు చేయాలని, అందుకు నవంబర్ 5న కలెక్టర్ కార్యాలయం వద్ద జరిగే ధర్నాలో పాల్గొనాలన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు పానగంటి శ్రీను, మున్సిపల్ నాయకులు సోమయ్య, ఆటో నాయకులు వెంకటేష్, హేమంత్, రాకేష్, నాగరాజు, సత్యం, వెంకన్న, యాదగిరి పాల్గొన్నారు.

రామనర్సయ్య ఆశయాలను కొనసాగిస్తాం

- ఇల్లందు మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నర్సయ్య



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నర్సయ్య

తిరుమలగిరి : సీపీఐ(ఎంఎల్) నాయకుడు పొట్ల రామనర్సయ్య ఆశయాలను కొనసాగిస్తామని ఇల్లందు మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నర్సయ్య అన్నారు. ఆదివారం పట్టణంలో సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ పార్టీ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా రామనర్సయ్య స్థూపం నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నర్సయ్య ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. నాటి ఇందిరాగాంధీ ప్రభుత్వం ఎమర్జెన్సీ విధించి చీకటి పాలన కొనసాగిస్తున్న రోజుల్లో రామనర్సయ్యను హైదరాబాద్‌లో అరెస్టు చేసి వరంగల్ జిల్లాలో కాల్చి చంపారని గుర్తుచేశారు. ఆయన మరణించినా ఆయన ఆశయాలు శాశ్వతంగా ప్రజల గుండెల్లో నిలిచాయన్నారు. రామనర్సయ్య చనిపోయి 48సంవత్సరాలైనా ఆయన ఆశయ సాధనకు పార్టీ నిరంతరం కృషి చేస్తుందన్నారు. కమ్యూనిస్టు పార్టీలు బలమైన విప్లవోద్యమాన్ని నిర్మించి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలన్నారు. విప్లవం విజయవంతం అవుతుందని అన్నారు. స్థూపం నిర్మాణానికి ప్రజలు, ప్రజాస్వామికవాదులందరూ సహకరించాలని కోరారు. కార్యక్రమంలో డివిజన్ కార్యదర్శి ఎర్ర అఖిల్‌కుమార్, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు జి.వెంకటేశ్వరరావు, సదానందం, జిల్లా కార్యదర్శి శివశంకర్, కొత్తగట్టు మల్లయ్య, ఎల్లంల యాదగిరి, రమేష్, రేణుక, వెంకన్న, నాగయ్య, కొమ్ము సోమయ్య, కందుకూరి కొండయ్య, చంద్రకళ, రేణుక, సంతోషి, లింగయ్య, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేయాలని ధర్నా



పీఏసీఎస్ కొనుగోలు కేంద్రం వద్ద ధర్నా చేస్తున్న గ్రామీణ పేదల సంఘం నాయకులు

చివ్వెంల : కొనుగోలు కేంద్రాల్లో పోసిన ధాన్యాన్ని ప్రభుత్వం వెంటనే కొనుగోలు చేయాలని ఆదివారం గ్రామీణ పేదల సంఘం ఆధ్వర్యంలో మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన పీఏసీఎస్ కేంద్రం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. వరికోతలు మొదలై 25రోజులు గడుస్తున్నా నేటికి కొనుగోలు చేయకపోవడంతో వర్షాలకు ధాన్యం తడిసి మొలకెత్తుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికీ ధాన్యం గింజా కొనుగోలు చేయలేదని, రైతులు ఐకేపీ సెంటర్లలో ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. కార్యక్రమంలో గ్రామీణ పేదల సంఘం నాయకులు కొణకంచి వీరభద్రయ్య, డీఎస్ఓ జిల్లా కార్యదర్శి భాష్పంగు సునిల్, అనంతుల యల్లయ్య, మల్లయ్య, శ్రీకాంత్, లక్ష్మి, లక్ష్మా, రాము, భీమా, పూలమ్మ, కొండల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఉద్యమకారులను ప్రభుత్వం ఆదుకోవాలి



సమావేశంలో పాల్గొన్న తెలంగాణ ఉద్యమకారులు

తిరుమలగిరి : రాష్ట్ర ప్రభుత్వం తెలంగాణ మలిదశ ఉద్యమకారులను ఆదుకోవాలని ఉద్యమకారుల సంఘం సభ్యులు కోరారు. ఆదివారం పట్టణంలో తెలంగాణ మలిదశ ఉద్యమకారుల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడారు. మలిదశ ఉద్యమకారుల సమస్యలపై ఈనెల 17నుంచి పాదయాత్ర చేయనున్నట్లు తెలిపారు. తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర సాధన కోసం అనేక ఉద్యమాలు చేసి జైలుకు వెళ్లామని, ఆత్మ బలిదానాలు చేసుకున్న వారిని గుర్తించి ప్రభుత్వం న్యాయం చేయాలన్నారు. ఉద్యమకారులకు 250గజాల స్థలం ఇచ్చి ఇళ్లను నిర్మించాలన్నారు. స్వాతంత్ర్య సమర యోధుల లాగానే ఉద్యమకారులకు కూడా పింఛన్ ఇవ్వాలన్నారు. ఉద్యమకారుల కోసం ప్రభుత్వం ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని, తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ఆత్మ బలిదానాలు చేసుకున్న కుటుంబాలకు రూ.25లక్షల ఆర్థికసాయం ప్రకటించాలన్నారు. అదే విధంగా కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో వ్యవస్థాపక అధ్యక్షుడు సామ అంజిరెడ్డి, కోతి మాధవి, సిద్దారెడ్డి, గోపి, సైలేందర్, సంకెపల్లి రఘునందన్‌రెడ్డి, రమణ, రెహమాన్‌అలీ, భిక్షంరెడ్డి, పూలమ్మ, యేసిరెడ్డి, కరుణాకర్, యాకయ్య, ఉదయ్, గఫార్‌ఖాన్, రమేష్, సాయి పాల్గొన్నారు.

కుల గణన చేపట్టడం హర్షణీయం

నూతనకల్ : రాష్ట్ర ప్రభుత్వం ఈనెల 6నుంచి కులగణన చేపట్టడం హర్షణీయమని బీసీ సంఘం జిల్లా నాయకుడు దరిపెల్లి వీరన్న అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం కులగణన చేపట్టడంతో జనాభా నిష్పత్తి ప్రకారం బడ్జెట్‌లో నిధులతో పాటు చట్టసభల్లో జనాభా ప్రకారం రిజర్వేషన్లు కల్పించడానికి అవకాశం ఉంటుందన్నారు. కేంద్ర ప్రభుత్వం కూడా 2025లో కులగణన చేపట్టాలని నిర్ణయం తీసుకోవడం సంతోషకరమన్నారు. కార్యక్రమంలో బీసీసంఘం నాయకులు పసుల అశోక్, వేల్పుల రఘు, అశోక్, లింగమల్లు, శంకర్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

బధిరుల పాఠశాలలో అన్నదానం



అన్నదానం చేస్తున్న దాతలు

చివ్వెంల : సూర్యాపేట మండలంలోని కాసరబాద గ్రామశివారులో గల బధిరుల పాఠశాలలో సూర్యాపేటకు చెందిన న్యాయవాది బత్తిని వెంకటేశ్వర్లు కుమార్తె జోషిత పుట్టినరోజు సందర్భంగా ఆదివారం విద్యార్థులకు అన్నదానం చేశారు. అదే విధంగా పండ్లు, బ్రెడ్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో బత్తిని నాగలక్ష్మి, నిర్వాహకులు, విద్యార్థులు పాల్గొన్నారు.